పంద్రాగస్టు సంబరాలకు ఏర్పాట్లు పూర్తి



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ కలెక్టరేట్ మైదానంలో పంద్రాగస్టు వేడుకలకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. గురువారం ఉదయం 9 గంటలకు మేడ్చల్ కలెక్టరేట్ ఆవరణలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేస్తారు. వివిధ జిల్లా శాఖలు కలెక్టరేట్ మైదానంలో వివిధ స్టాల్స్, ప్రగతి రథాలను ఏర్పాటు చేస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలను అందించిన అధికారులు, ఉద్యోగులకు ముఖ్య అతిథులు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో లయోల కళాశాల విద్యార్థులు

మేడ్చల్: లింగాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు అవగాహన కలిపించారు. నగరంలోని సుచిత్ర సర్కిల్‌లోని లయోల అకాడమీకి చెందిన బీఎస్సీ విద్యార్థులు లింగాపూర్ పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రానికి విచ్చేసి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కలిపించారు. వివిధ అంశాలపై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచనవారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం వెంకటరమేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీ సంజీవయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ కవిత, లయోల ప్రిన్సిపాల్ జోజిరెడ్డి, హెచ్‌ఓడీ జ్ఞానషిబా, ప్రొఫెసర్లు ఓనిక్స్, స్టీఫెన్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ పనులను పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు ద్వారకానగర్‌లో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను చైర్ పర్సన్ పావనీజంగయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ... సీసీ పనుల్లో నాణ్యత లోపించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సత్వరమే ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కౌన్సిలర్ రవీందర్, ఏఈ శ్రీనివాస్, జంగయ్య యాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



కీసర: మండల కేంద్రమైన కీసరలోని స్నేహకాలనీలో కొత్తగా నిర్మించిన వినాయక దేవాలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రామిడి స్వప్న విజయ్‌రెడ్డి ఆలయ నిర్మాణంతోపాటు, విగ్రహ ప్రతిష్ఠాపత్సవాలకు సహకరించడం పట్ల ఆయన అభినందించారు. కాంగ్రెస్ నేతలు జూపల్లి రవీందర్, వివిధ పార్టీల నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



భూమిపూజ చేసిన కౌన్సిలర్ పంబాల సరితారమేష్

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని కౌన్సిలర్ పంబాల సరితారమేష్ అన్నారు. బుధవారం 1వ వార్డులోని వివిధ కాలనీలో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు, అంతర్గత మురుగునీటి కాలువ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు.

పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



కీసర: యాద్గార్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను బుధవారం లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు హరీశ్‌రెడ్డి, ఇన్నారెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, రామారావు, రాములు, హనుమంత్‌రావు, లక్ష్మీమూర్తి, హెచ్‌ఎం పుష్పకళ, ఉపాధ్యాయులు సావిత్రి, నరసింహారెడ్డి, తిరుమల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కాప్రా: కాప్రా డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి వినతిపత్రం అందజేశారు. కాప్రా డివిజన్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన వాటర్ రిజర్వాయర్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీసాయిఎన్‌క్లేవ్‌లో రూ.30 లక్షలతో నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి జలమండలి ఎండీ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ వివరించారు.

ప్రభుత్వ భూముల సంరక్షణే లక్ష్యం!

- పరాధీనమైన భూములు ప్రభుత్వ ఖాతాలోకి...
- రూ. వంద కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలకు రక్షణ
- హద్దురాళ్లు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తున్న కాప్రా తహసీల్దార్ సుచరిత

జవహర్‌నగర్: గ్రేటర్‌కు కూతవేటు దూరంలో ఉన్న మండలం. ఎక్కువ శాతం ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిని కాజేసేందుకు కబ్జాదారులు కుట్రలు పన్నుతున్నారు. అంతేకాకుండా సంరక్షణకు వెళ్లిన అధికారులపై దాడులకూ తెగబడుతున్నారు. అయినా అదరకుండా, బెదరకుండా మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచనలతో ఓ తహసీల్దార్ వాటిని కాపాడానికి కంకణబద్ధులయ్యారు. గతంలో కాప్రాలోని కస్టోడియన్ భూములను రక్షించేందుకు వెళ్లిన తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌పై ఉల్టా కేసు నమోదు చేయించి కబ్జాచేయాలని ప్రయత్నించారు.

- ఈ విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన ఆ తహసీల్దార్ ఆ భూమి కబ్జాదారుల చెరలోకి వెళ్లకుండా తమదైన శైలిలో ప్రదర్శించి కోట్ల రూపాయల విలువైన భూమిని రక్షించారు. కాప్రా మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సుచరిత సైతం అదే ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. దీంతో ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే కాప్రా తహసీల్దార్ సుచరిత ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని రక్షించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడ ప్రస్తుతం గజం స్థలం రూ. 15 వేల నుంచి రూ. 50 వేల వరకు ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో కొంత మంది కబ్జాదారులు ప్రభుత్వ స్థలాలను ప్లాట్లు చేసి అమ్మి రూ. లక్షల్లో విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.
- జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు కాప్రా మండల బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ సుచరిత తనదైన శైలిలో ప్రభుత్వ స్థలాలను విక్రయిస్తున్న వారిని గుర్తించి కొరడా ఝుళిపిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇలా ఏకంగా వందలాది నిర్మాణాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి కూల్చివేతలు చేపట్టడం కలకలం రేపిన విషయం తెలిసిందే. అంతేకాకుండా ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. విధులకు ఆటంకం కలిగించే వారిని సైతం జైలు పంపించడం జరిగింది. సీరియస్‌గా రంగ ప్రవేశం చేయడంతో కబ్జాదారుల్లో వణుకు మొదలై అక్రమ నిర్మాణాలకు బ్రేక్ పడింది.

రెవెన్యూ గుప్పిట్లో చిట్టా...

భూకబ్జాలకు పాల్పడే వ్యక్తుల వివరాలను సేకరించే పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వారి చిట్టా రెవెన్యూ డైరీలో ఉంది. పూర్తిస్థాయిలో వివరాలు సేకరించిన తర్వాత చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కబ్జాలకు పాల్పడే వారితో పాటు వారికి సహకరించే వారిపై కూడ నిఘా పెట్టారు. కబ్జాలకు పాల్పడే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదంటున్న అధికారులు ఆ దిశగా చర్యలకు శ్రీకారం చుట్టే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అమాయక ప్రజలు కష్టపడి కూడపెట్టుకున్నదంతా ఎగురేసుకుపోతున్న ల్యాండ్ మాఫియాను ఎట్టి పరిస్థితుల్లోను వదలద్దని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు రెవెన్యూ అధికారులను వేడుకుంటున్నారు.

22 ఎకరాలకు కంచె ఏర్పాటు...

కాప్రాలోని సర్వే నెం. 535, 510లలో 30 గుంటలు, జవహర్‌నగర్‌లోని సర్వే నెం.773,774, (9 ఎకరాల 30 గుంటలు), 727లో (2 ఎకరాలు), 808, 809లలో (10 ఎకరాలు) 804 (4 ఎకరాల 30 గుంటలు) ఈ స్థలాన్ని పాఠశాలకు కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 25 ఎకరాల వరకు కబ్జాదారుల చెరనుంచి కాపాడి ప్రభుత్వ పరం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఇప్పటికే వందల ఎకరాల స్థలాలను రక్షించి హద్దులు, ప్రభుత్వ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. కలెక్టర్ నుండి నిధులు మంజూరు కాగానే ప్రజా అవసరాలకు అనుగుణంగా ఫెన్సింగ్, ప్రహరీ నిర్మాణాలకు శ్రీకారం చుట్టడానికి అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా చెరువు శిఖం భూములను సర్వే చేయించి అక్కడ పూర్తిస్థాయి ఫెన్సింగ్ వేయనున్నట్లు సమాచారం.

భూకబ్జాదారుల ఆటకట్టిస్తాం



ప్రభుత్వ భూములను రక్షించడమే లక్ష్యంగా పనిచేస్తా. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను కబ్జాచేయాలని చూస్తే మాత్రం ఊరుకునే సమస్యే లేదు. కాప్రా మండలంలో ఇప్పటికే 25 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నాం. ఎక్కడెక్కడ భూకబ్జాలు జరుగుతున్నాయి. ఎవరు విక్రయిస్తున్నారు. వారి వెనుక ఎవరున్నారు? అనే విషయంపై ప్రత్యేక దృష్టి సారించాం. పూర్తి నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తాం. కాప్రా కస్టోడియన్ భూముల వ్యవహారంలో కొందరు కబ్జాదారులు తప్పుడు పత్రాలు సృష్టించి కోట్ల విలువైన భూమిని కాజేయాలని విశ్వప్రయత్నాలు చేశారు. అంతేకాకుండా క్రిమినల్ చర్యలకు సైతం పాల్పడ్డారు. అయినా ప్రభుత్వ భూమిని కాపాడం కోసం ఎంత దూరమైనా వెళ్లి రక్షించడమే మా బాధ్యత.. ప్రభుత్వ స్థలాలను కాపాడే బాధ్యత మాపై ఉంది. ప్రజాప్రతినిధులు సహకరిస్తే మరింత ముందుకెళ్తాం.

– సుచరిత, కాప్రా తహసీల్దార్

వివాదాస్పద భూమిలో పనుల నిలిపివేత

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో నాసిమ్‌చెరువు సమీపంలోని శ్మశాన వాటిక విషయంలో హైకోర్టు స్టే ఉన్నా బుధవారం శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపట్టడం వివాదాస్పదమైంది. వివరాలివీ... దమ్మాయిగూడ మున్సిపల్ నాసిమ్ చెరువు బఫర్ జోన్ సర్వేనెంబర్ 473'2లోని శ్మశాన వాటిక వద్ద సుమారు రూ. 30 లక్షల మున్సిపల్ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మున్సిపల్ పాలకవర్గం గతంలో పనులు ప్రారంభించడంతో స్థానికంగా ఉన్న పలుకాలనీ వాసులు చెరువు బఫర్ జోన్‌లోని శ్మశాన వాటిక వద్ద ఎలాంటి పనులు చేపట్టవద్దని హైకోర్టులో కేసు వేశారు. దీంతో హైకోర్టు స్టే విధించింది. ఇదిలా ఉండగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని వివిధ పార్టీలకు చెందిన నేతలు, స్థానికులు కొందరు బుధవారం శ్మశాన వాటిక వద్ద తిరిగి అభివృద్ధి పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పలు కాలనీవాసులు పోలీసులకు, జిల్లా కలెక్టరేట్, కీసర తహసీల్దార్, కీసర ఆర్డీఓ కార్యాలయాల అధికారుల తోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జవహర్‌నగర్ పోలీసులు, కీసర రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు శ్మశాన వాటిక వద్దకు చేరుకొని పనులను తాత్కలికంగా నిలిపివేశారు. కొంత మంది స్థానికులు పనులను నిలుపుదల చేయడం పట్ల నిరసన వ్యక్తం చేశారు.

హోటల్ తనిఖీ

ఘట్‌కేసర్: పట్టణంలోని అన్నపూర్ణ హోటల్‌ను మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్ బుధవారం తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు శుభ్రంగా లేవని టిఫిన్‌లో పురుగులు వచ్చాయని ఆరోపణల నేపథ్యంలో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటల్ వంటగదిని పరిశీలించి ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించారు. ల్యాబ్ నివేదికను అనుసరించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, సిటీబ్యూరో: పట్టణాలు, గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. రోజువారీగా నిర్వహిస్తున్న సర్వే ఆధారంగా పల్లెలు, పట్టణ ప్రాంతాలలో వైద్య పరీక్షలు చేపడుతూ పరిస్థితులను అనుగుణంగా అంబులెన్సులు, మందులు, రాపిడ్ టెస్ట్ కిట్లను అందుబాటులో సిద్ధంగా ఉంచాలన్నారు. బుధవారం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ గౌతమ్ మట్లాడుతూ... పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించి పరిశుభ్రత, ఆహార, ఆరోగ్య విషయాలపై మండల ప్రత్యేక అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరాన్ని బట్టి ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి, రోజువారీ సమాచారాన్ని అందించాలని స్పష్టం చేశారు. వీధి కుక్కలు, కోతులను నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో నమోదైన డెంగీ కేసుల వివరాలను గుర్తించి రోగులకు కావలసిన ప్లేట్‌లెట్స్ ఎక్కించడానికి తగినంత రక్తాన్ని నిలువ ఉంచుకోవాలన్నారు. డెంగీ, వైరల్ జ్వరాలతో వచ్చినవారికి ఆయా ఆస్పత్రుల్లో అత్యవసర వైద్య సదుపాయాలను కల్పిస్తూ అదనంగా కావలసిన మందులు, బెడ్లు, రాపిడ్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఎంహెచ్ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కీసరగుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు

రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్



ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్

కీసర: రాష్ట్ర రాజధానికి చేరువలో ఉన్న కీసరగుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యార్ అన్నారు. బుధవారం ఆమె దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి కీసరగుట్టను సందర్శించారు. కీసరగుట్టలో కొలువైన రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావులకు కీసరగుట్ట వేదపండితులు స్వామివారి ఆశీర్వచనం తోపాటు, మహాప్రసాదాన్ని అందజేశారు. దాతల సహకారంతో దేవస్థానం వద్ద కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల వివరాలను ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి వివరించారు. కీసరగుట్ట ఆలయంతోపాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు శైలజరామయ్యర్ వెల్లడించారు. ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు టి.నారాయణ, టి.వెంకటేష్, శ్రీనివాస్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య



కీసర: కళాశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులను సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం తథ్యమని కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య హెచ్చరించారు. బుధవారం చీర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... ర్యాగింగ్ వల్ల విద్యార్థుల బంగారు భవిష్యత్తు అంధకారం అవుతుందని స్పష్టం చేశారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ మహమ్మరిని అరికట్టేందుకు ప్రభుత్వం 2009లో చట్టం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. కళాశాల చైర్మన్ జి.రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాలో హిందువులకు రక్షణ కల్పించాలి



కాప్రా మండల కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న ఈద్గా కమిటీ సభ్యులు

కాప్రా: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని కోరుతూ.. కాప్రా ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కాప్రా మండల కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసనలో ఈద్గా కమిటీ చైర్మన్ ఎం.కే బద్రోద్దీన్ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామని, వారికి అక్కడి ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఏ రహీం, షేక్ సలీం, ముత్తవలి ఖాండ్‌బాయ్, గౌస్, మహ్మద్ రెహమాన్, షరీఫ్, నూరుద్దీన్, జిలానీ, పర్వేజ్, అహ్మద్, మస్కత్, రాజుగౌడ్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో చైర్మన్ రాంరెడ్డిపై కేసు నమోదు

పోచారం: ప్లాటు ఓనర్‌ను బెదిరించినందుకు ఘట్‌కేసర్ సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డిపై పోచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... ఘట్‌కేసర్, జయపురికాలనీలోని సర్వే నెంబర్లు 559, 563లలో మామిడి సోమయ్య తన ప్లాట్లను జేసీబీతో చదును చేస్తుండగా సింగిరెడ్డి రాంరెడ్డి, గడీల సంజీవరెడ్డి పనులను అడ్డుకున్నారు. సోమయ్యపై దాడి చేసి, దూషించారు. దీంతో భయపడిన సోమయ్య 100కు కాల్ చేయగా పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని పనులను అడ్డుకున్న వారికి పంపించి వేశారు. బాధితుడు సోమయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రాంరెడ్డి, సంజీవరెడ్డిలపై కేసు నమోదు చేశారు.

నారాయణమ్మ సేవలు చిరస్మరణీయం



నారాయణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జవహర్‌నగర్: సీపీఐ (ఎంఎల్) నాయకురాలు నారాయణమ్మ సేవలు చిరస్మరణీయమని పలువురు ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. నారాయణమ్మ బుధవారం మృతిచెందడంతో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యదర్శి షేక్ షావలీ మాట్లాడుతూ... నారాయణమ్మ ఉద్యమకారులను తల్లిలా ఆదరించేదని గుర్తుచేశారు. స్థానిక నేతలు వెంకటేశ్వర్లు, సునిత, చిట్టెమ్మ, నరేందర్, శ్రీధర్, సురేందర్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనపై దృష్టి సారించాలి

అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

సాక్షి, సిటీబ్యూరో: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌పై పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా (స్థానిక సంస్థలు) ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌పై నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో ఆమె మాట్లాడారు. కచ్చితమైన ప్రణాళికతో పక్కాగా సర్వే చేసేందుకు సులభంగా సంబంధిత విషయాలను సకాలంలో పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు, విధి విధానాలకు సంబంధించిన సూచలను అదనపు కలెక్టర్ అందించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రాసెసింగ్ కోసం రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, పంచాయతీ అధికారులతో బృందాలుగా ఏర్పాటుచేసి, మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి అవసరమైన చర్యలను తీసుకుంటామన్నారు. ఇందులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, అసిస్టెంట్ ఇంజినీర్లు (నీటిపారుదల శాఖ), ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సందడిగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ఘట్‌కేసర్‌లో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

ఘట్‌కేసర్: పట్టణంలో బీజేపీ మున్సిపల్ శాఖ, బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా జెండా ర్యాలీని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్ హాజరై ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్వాసంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయులందరూ తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఆవిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు చిత్తరంజన్, చిత్తరంజన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, కార్యదర్శి నరేందర్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, సురేంద్ర, అనిల్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో...

మేడ్చల్: స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా మేడ్చల్‌లో బీజేపీ నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణ పుర వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్‌లకు జెండాలు పెట్టుకుని, చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. భారత్‌మాతకి జై అనే నినాదం మారు మోగింది.

గుండ్లపోచంపల్లిలో...

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బుధవారం సాయంత్రం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీని బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కావేరి శ్రీధర్, మున్సిపల్ అధ్యక్షుడు విక్రమ్, కౌన్సిలర్ సరస్వతి మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, నాయకులు నరేశ్, అశోక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



గుండ్లపోచంపల్లిలో ర్యాలీ ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు